క్లుప్తంగా

‘ఆదిత్య’ను సందర్శించిన ఎంపీ మిథున్ రెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న ఆదిత్య కళాశాలల చైర్మన్, వైస్ చైర్మన్లు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ విద్యా సంస్థలను ఎంపీ మిథున్ రెడ్డి సందర్శించారు. కాకినాడలో సోమవారం జరిగిన సామాజిక సాధికారత బస్సు యాత్రలో పాల్గొన్న ఆయన తిరుగు ప్రయాణంలో మార్గం మధ్యలో ఆదిత్య కళాశాలలను సందర్శించారు. ఆయనకు కళాశాలల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

‘నాడు-నేడు’ పనుల పరిశీలన

శంఖవరం: ప్రభుత్వ పాఠశాల్లో చేపట్టిన రెండో విడత నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తేజ సూచించారు. మండలంలోని మండపం జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. నిబంధనలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని సూచించారు.

శ్రీప్రకాష్‌లో రిమ్‌జిమ్ వేడుకలు ప్రారంభం



రిమ్‌జిమ్ వేడుకల్లో అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో రిమ్‌జిమ్ వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తుని శ్రీప్రకాష్ విద్యాసంస్థల ప్రాంగణంలో రిమ్‌జిమ్ వేడుకలను విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ ప్రారంభించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు సాహిత్యం, సంగీతం, క్రీడలు, లలిత కళలు, థియేటర్ ఆర్ట్స్, సైన్స్ తదితర 29 అంశాలపై జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. తొలి రోజు విద్యార్థులు వేసిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

పెన్షనర్లకు మెరుగైన బ్యాంకు సేవలు

తుని: రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు అన్నారు. స్థానిక కోర్టు వీధిలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో సోమవారం తుని శాఖ అధ్యక్షుడు పి.మాధవరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు, తుని శాఖ మేనేజర్ సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెన్షనర్లు బ్యాంకుకు వస్తే సత్వరమే సేవలు అందిస్తామన్నారు. ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అసోసియేషన్ తుని శాఖ కార్యదర్శి త్రిమూర్తులు, కృష్ణ, ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం ధనంమెట్టపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ గ్రామానికి చెందిన మద్దా వెంకన్న సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ధనంమెట్టలో ఏడాది కాలంగా అక్రమ మైనింగ్ జరుగుతోందన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన దానికంటే ఎక్కువగా మైనింగ్ చేస్తూ పగలు, రాత్రి తేడా లేకుండా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ మైనింగ్ కారణంగా సమీపంలోని పండ్ల తోటలు పాడవ్వడంతో పాటు శబ్ద, వాయు కాలుష్యంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

11న విశ్వరూప మహాసభ

తొండంగి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు కింతాడ సత్తిబాబు పిలుపునిచ్చారు. తొండంగిలో సోమవారం చలో హైదరాబాద్ ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గోకవరం: గోకవరం శివారున గంగాలమ్మ ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కామరాజుపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై రాజమహేంద్రవరం నుంచి గోకవరం వైపు వస్తుండగా గంగాలమ్మ ఆలయం సమీపంలో ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గోకవరం పోలీసులు తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యమస్తు

- జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం
- మండలంలో 7751 మందికి సేవలు శస్త్ర చికిత్సలకు 210 మంది ఎంపిక



జగన్నాథగిరిలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

తుని రూరల్: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చేశారు. గ్రామీణ ప్రజలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా నెల రోజుల పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. నిపుణులైన వైద్యులతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులను వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో శస్త్ర చికిత్సలకు రిఫర్ చేశారు.

17 రకాల పరీక్షలు

తుని మండలంలోని తేటగుంట, ఎస్.సూరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించి మందులను అందజేశారు. ఈ శిబిరాల్లో 7751 మందిని పరీక్షించారు. ఇందులో స్త్రీలు 4601 మంది, పురుషులు 3150 మంది ఉన్నారు. 17 రకాల వైద్య పరీక్షలు చేసిన వైద్యులు 172 రకాల మందులను రోగులకు అందజేశారు. 210 మందిని శస్త్ర చికిత్సలకు రిఫర్ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అందించిన వైద్య సేవల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాలతో పేదలందరికీ ఆరోగ్య భద్రత కలిగిందని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కె.అన్వేషి, డాక్టర్ రాజశేఖర్ తెలిపారు.

ఏలేశ్వరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఏలేశ్వరం: పట్టణంలోని 8, 9 వార్డుల పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యుడు పాపారావు ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మందుల కిట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, డేగల వెంకటరమణ, కోరాడ ప్రసాద్ పాల్గొన్నారు.

సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం

ప్రత్తిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి అన్నారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరితో కలిసి ఆమె ప్రారంభించారు. వైద్యాధికారి ఆర్ఆర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 365 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వీరబాబు, చెలంకూరి రాజబాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో రోగులకు మందుల కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యవతి

సకాలంలో వైద్యం



గత నెల 16న ఆయాసంతో కుప్పకూలిపోయాను. పక్క గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని తెలుసుకున్న మా బంధువులు టి.వెంకటాపురం తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు సకాలంలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తుని ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య సేవలు పొందడంతో కోలుకున్నాను. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను.

– మలగంటి లోకేష్, హెచ్.కొత్తూరు

నా భర్తకు ప్రాణాలు నిలిచాయి



గత నెల 18న మా ఊరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. అదే సమయంలో నా భర్త కుంచే బాబూరావు తీవ్ర గుండెపోటుకు గురయ్యాడు. సురక్ష శిబిరంలో డాక్టర్లు వైద్యసేవలు అందించి కాకినాడకు తరలించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెకు శస్త్ర చికిత్స చేశారు. ఇందుకు అయిన మొత్తం ఖర్చు రూ.1.80 లక్షలను ఆరోగ్యశ్రీలో ప్రభుత్వమే చెల్లించింది. డిశ్చార్జ్ చేయడంతో ఇంటికి తీసుకువచ్చాం. రోజూ ఏఎన్ఎం వచ్చి పరీక్షిస్తుంది.

– కుంచే కొండమ్మ, చేపూరు

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ



తుని పట్టణంలో బంగ్లా రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 6, 7, 8, 9, 10 వార్డుల ప్రజలకు అవసరమైన ట్రావెల్స్ బంగ్లా ప్రధాన రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రోడ్డును పట్టించుకోలేదన్నారు. ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు సమస్యను కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకువరావడంతో నిధులు మంజూరు చేశామన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- వ్యవసాయశాఖ జేడీ విజయకుమార్
- జె.కొత్తూరు,రాజపూడి గ్రామాల్లో దెబ్బతిన్న వరి పొలాల పరిశీలన



జె.కొత్తూరులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్

జగ్గంపేట: వర్షాభావ పరిస్థితుల కారణంగా వరి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని జిల్లా వ్యవసాయశాఖ జేడీ విజయకుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని జె.కొత్తూరు, రాజపూడి గ్రామాల్లో ఎండిపోయిన పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంటకు గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదన్నారు. వర్షాభావ పరిస్థితులతో పాటు తాళ్లూరు ఎత్తిపోతల పథకంలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో పంటలకు నీరు అందలేదన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి పంటనష్టం అంచనా వేస్తున్నామని, నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. లోటు వర్షపాతం కారణంగా జగ్గంపేట మండలంలో 2300 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. జె.కొత్తూరు, రాజపూడి గ్రామాల సర్పంచులు నకిరెడ్డి నాగేశ్వరరావు,బూసాల విష్ణు రైతులతో కలిసి పంట దెబ్బతిన్న పొలాలను అధికారులకు చూపించారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీదేవి, వ్యవసాయశాఖ ఏడీ వైపీ గంగాధర్, మండల వ్యవసాయాధికారి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

గండేపల్లి: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో సోమవారం డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ విద్యార్థులు, యువత సన్మార్గంలో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సీఎస్ఈ-ఏఐ, ఎంఎల్ అడ్వాన్స్‌డ్ ప్రోగ్రామింగ్ నూతన ల్యాబ్‌లను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సై వై.గణేష్ కుమార్, ప్రిన్సిపాల్ ఎ.రమేష్, ఎం.కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కుశరాజు

కోటనందూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా సేకరించే ధాన్యం రవాణా చేసే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ చేయించుకునేలా రైతులను ప్రోత్సహించాలని తహసీల్దార్ కె.కుశరాజు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయశాఖ సిబ్బంది, వీఆర్వోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కుశరాజు మాట్లాడుతూ వచ్చే రెండు మూడు రోజుల్లో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో జీపీఎస్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో విధిగా పంట కోత ప్రయోగాలు నిర్వహించాలని సూచించారు. పంటకోత ప్రయోగాల ఆధారంగానే నష్టం జరిగిన రైతులకు పంటల బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కేజే చంద్రశేఖర్, ఏఎస్ఓ వామనమూర్తి, హెచ్ఓ జీవీ లక్ష్మి, ఏఈఓ శివకుమారి, వీఆర్వో సంఘ అధ్యక్షుడు వేగి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



అల్లిపూడిలో మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కోటనందూరు: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు అన్నారు. మండలంలోని అల్లిపూడిలో సోమవారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా పంచాయతీ నిధుల నుంచి మొక్కలు కొనుగోలు చేసి గ్రామంలో నాటుతున్నట్టు తెలిపారు.మొక్కల పెంపకంతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి అందరూ మొక్కలు పెంచేలా ప్రోత్సహించాలన్నారు. గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ సిబ్బంది, గ్రీన్ అంబాసిడార్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చింతకాయల చిట్టిబాబు, పంచాయతీ కార్యదర్శి ఏవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం



ప్రత్తిపాడులో తహసీల్దార్ గోపాలకృష్ణను సత్కరిస్తున్న మాదిగలు

ప్రత్తిపాడు: దీర్ఘకాలంగా ఉన్న మాదిగల భూసమస్యను పరిష్కరించిన తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణకు సోమవారం సత్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ గోపాలకృష్ణను మాదిగలు గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. తమ సామాజిక వర్గానికి తహసీల్దార్ చేసిన సేవలను కొనియాడారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.మధుబాబు, మాదిక సంఘ ప్రతినిధులు మోర్తా రాజేంద్రప్రసాద్, విజయ్‌కుమార్, రుద్రయ్య, జెడ్డా రాజేంద్ర, డిప్యూటీ తహసీల్దార్లు డి.శ్రీనివాసరావు, పుణ్యవతి, కల్యాణి, మండల సర్వేయర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు స్ఫూర్తి ప్రజాసంకల్పయాత్ర



జగ్గంపేటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



పోతులూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



మల్లివీడులో కేక్ కట్ చేసి సంబరాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు నాంది ప్రజా సంకల్పయాత్ర అని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ నేతలు సంబరాలు జరిపారు. తొలుత స్థానిక బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒమ్మి రఘురాం మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి 2017 నవంబర్ 6న ప్రజా సంకల్ప యాత్రను ప్రారంభించారన్నారు. సుమారు 341 రోజుల పాటు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను తెలుసుకున్నారన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు అన్నారు. ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలోని పోతులూరులో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు జరిపారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంకల్ప యాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పథకాలను రూపొందించి అమలు చేశారన్నారు. నవరత్నాలు పథకాలు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొండు రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్ నాగులాపల్లి బాబ్జి, సచివాలయం కన్వీనర్ నాగులాపల్లి రాంబాబు, ఎంపీటీసీ ముప్పిడి ఏసుబాబు, బర్ల చంటిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని మల్లివీడు, తూర్పులక్ష్మీపురం, లింగంపర్తి, యర్రవరం, భద్రవరం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకులు కట్ చేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నాంది ప్రజాసంకల్పయాత్ర

ప్రత్తిపాడు: ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్తిపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు సంబరాలు జరిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ గుడాల విజయలక్ష్మి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కర్‌రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ చేరు కృష్ణ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



లింగంపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు ఏఓ జ్యోతి తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ జ్యోతి మాట్లాడుతూ మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, భద్రవరం, పేరవరం, సిరిపురం, యర్రవరం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. కనీస మద్దతు ధర సాధారణ రకం 100 కేజీల బస్తాకు రూ.2183, గ్రేడ్ ఏ (సన్నాలు) 100 కేజీల బస్తాకు రూ.2203 చెల్లిస్తారన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు నేరుగా బ్యాంక్ ఖాతాలో నగదు జమ చేస్తారన్నారు. ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గిడజాంలో శాంతిహోమాలు

రౌతులపూడి: మండలంలోని గిడజాంలో సోమవారం శాంతి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో గత కొంతకాలంగా అశాంతి నెలకొని అకాల మరణాలు సంభవించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామం నడిబొడ్డున ఉన్న 150 ఏళ్ల చరిత్ర కలిగిన వటవృక్షం ఐదునెలలు క్రితం ఈదురుగాలులకు కూలిపోయింది. అప్పటి నుంచి గ్రామంలో తీవ్ర అశాంతి నెలకొంది. అకాల మరణాలు సంభవిస్తున్నాయని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో శాంతిని నెలకొల్పేందుకు గ్రామ పెద్దలు, యువకుల ఆధ్వర్యంలో సోమవారం పలు హోమాలు, పూజలు చేశారు. వేద పండితులు మృత్యుంజయ హోమం, వాస్తు హోమం, రుద్ర హోమం వంటి పలు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వటవృక్షం స్థానంలో రావి, వేప మొక్కలు నాటారు. మధ్యాహ్నం గ్రామంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నిరుపేదల గుండెచప్పుడు ‘నవరత్నాలు’



జగ్గంపేటలో మాజీ మంత్రి తోట నరసింహాన్ని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో నిరుపేదల గుండె చప్పుడు విని నవరత్న పథకాలకు రూపకల్పన చేశారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని వైఎస్సార్ సీపీ నేత జగాల్ స్వగృహంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సామాజిక సాధికారిక యాత్రను ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్షలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందాయన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం తోట నరసింహాన్ని వైఎస్సార్ సీపీ నేతలు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తోట రాంజీ, అత్తులూరి సాయిబాబు, తులా రాము, పరిమి వెంకటేశ్వరరావు, తోట అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

కురుక్షేత్ర సభను విజయవంతం చేయాలి



లోవకొత్తూరులో ఐక్యత చాటుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తుని: ఢిల్లీలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే కురుక్షేత్ర సంగ్రహ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. మండలంలోని లోవ కొత్తూరులో సోమవారం నిర్వహించిన సమావేశానికి వీరయ్య మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందన్నారు. 2014, 2019 ఎన్నికల సమయంలో మాదిగ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెడతామని చెప్పారని, ఇప్పటికీ అమలు కాలేదన్నారు. 2024 ఎన్నికల్లో అన్ని రాష్ట్రాల్లోనూ ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేస్తూ కురుక్షేత్ర సంగ్రహ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పలివెల రవి, ఎం.సత్యనారాయణ, సతీష్, అజయ్ బాబు, శ్రీను, ముసలయ్య, శివమణి పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ పోస్టర్ ఆవిష్కరణ

తుని: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించ తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.రాము కోరారు. తుని రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఉద్యమం 1000 రోజులు పూర్తి చేసుకుందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఆపాలని, కడప ఉక్కు పరిశ్రమను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు కుమార్‌రాజా, మణికంఠ, ఆజయ్, సాయి పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ

జగ్గంపేట: స్థానిక పెన్షనర్ల సంఘానికి భారతీయ స్టేట్ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ ర్యాలి కల్యాణ్ శ్రీనివాస్ వాటర్ కూలర్‌ను బహూకరించారు. తన తండ్రి వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం శ్రీనివాస్ పెన్షనర్ల సంఘ నాయకులకు సోమవారం వాటర్ కూలర్ అందజేశారు.

ఎనిమిది మంది బైండోవర్

ప్రత్తిపాడు: ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలాల్లో సారా కేసుల్లో నిందితులుగా ఉన్న ఎనిమిది మందిని బైండోవర్ చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. వీరు తరచూ సారా విక్రయాలు చేస్తూ పరారు కావడంతో బైండోవర్ చేసి స్థానిక తహసీల్దార్ పీవీవీ గోపాల కృష్ణ వద్ద హాజరు పరిచినట్టు తెలిపారు.